అథర్వణవేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

18 మహావాక్యోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

శ్లోక తాత్పర్య పుష్పమ్

శ్లో॥ యత్ మహావాక్య సిద్ధాన్త
మహావిద్యా కళేబరమ్,
వికళేబర కైవల్యం
రామచంద్రపదం భజే॥



ఏదైతే వేదోపనిషత్ ప్రవచితమైన మహావాక్యముల సిద్ధాంతసారమగు 'మహావిద్య'గా మూర్తీభవించినదై యున్నదో, వికళేబర కైవల్యమై (విదేహ కైవల్య స్వరూపమై) విరాజిల్లుచున్నదో, అట్టి శ్రీరామచంద్ర మూర్తి యొక్క పదమును భజించుచున్నాము.

ఓం 1. అథ హైవాచ భగవాన్ బ్రహ్మా : "అపరోక్షానుభవ పర-ఉపనిషదమ్" (పరోపనిషదమ్) వ్యాఖ్యాస్యామః॥	**భగవానుడగు చతుర్ముఖ బ్రహ్మదేవుడు** : మహర్షులు, మానసపుత్రులు, దేవతలు మానవులు-మొదలైన సమస్త ప్రియ ముముక్షు జనులారా! ఇప్పుడు మనము-**"అపరోక్షానుభవము"**యొక్క ఉప (**సామీప్య**) నిషదము (**ఆసీనము**) (Sitting Very Close) గురించి వ్యాఖ్యానించుకుంటున్నాము. (నిషాదము - కూర్చుండబెట్టడము).
గుహ్యాత్ గుహ్యతరమ్ ఏషా। న ప్రాకృతాయ ఉపదేష్టవ్యా।	ఈ అపరోక్షానుభవ విశేషాలు - రహస్యాలన్నిటికంటే రహస్యమైనది. ప్రాకృత, ప్రాపంచక, బాహ్యేంద్రియ దృష్టి, ఆశయము కలవారు ఈ **"అపరోక్షానుభవము"**ను బోధింపబడటానికి అర్హులు కారు.
సాత్త్వికాయ, అంతర్ముఖాయ పరి శుశ్రూషవే॥ (ఉపదేష్టవ్యా)।	ఎవ్వరైతే సాత్త్విక గుణ సంపన్నులై, బాహ్యముగా కనిపించే నామ-రూప-గుణ-మార్పు చేర్పులను అధిగమించిన "అంతర్ముఖ దృష్టి" కలిగి ఉంటారో, గురువు వద్ద [ప్రణిపాత (నమస్కరిస్తూ), పరిప్రశ్నలతో కూడి] శుశ్రూష చేయువారై ఉంటారో,- **వారు ఉపదేశమునకు తప్పకుండా అర్హులే!**
2. అథ సగ్ంసృతి బంధ - మోక్షయోః। విద్యా - అవిద్యే చక్షుషీ ఉపసగ్ంహృత్య విజ్ఞాయ, అవిద్యా లోక-అంధః తమో దృక్।	దృశ్యముతో పెట్టుకొంటున్న సంసృతి (అవినాభావభావ సంబంధము)ను అనుసరించే బంధములు ఏర్పడుచున్నాయి. సంబంధము ఏర్పరచుకొని ఉంటే **బంధము**. అంతరమున సంబంధము లేనివాడై ఉంటే - **మోక్షము.** (బంధ మోక్షములకు) విద్య అవిద్యలు రెండు వేరైనచూపుల (దృష్టులు) వంటివి. అందుచేత **జగత్ భావములను ఉపశమింపజేయుచు, విజ్ఞానదృష్టి ఆశ్రయించెదరు** గాక. లోకమును- అజ్ఞాన, లోకపరిమిత, తమో దృష్టితో దర్శించటమే అవిద్య.
తమో హి శారీర ప్రపంచమ్। ఆబ్రహ్మ స్థావరాంతమ్॥ అనంతాఖిల అజ అండభూతమ్। (అనంతాఖిలాజాండభూతమ్)।	ఈ శరీరమునుండి ప్రపంచము వరకు ఏర్పడి ఉన్నట్లు కనిపిస్తూ, బ్రహ్మ నుండి-స్థావరము కనిపించేదంతా కూడా **తమో (మాయా) ఆవరణయే।** ఆత్మ-ఈ అఖిలాండకోటి బ్రహ్మాండస్వరూపము. అజము. జననమే లేనట్టిది. మొదలు చివర లేనిది. అజ-అండ భూతము. (కలలోనో, కల్పనలోనో కనిపించే) కల్పనా వస్తువుకు జననమెక్కడిది? నాశనమెక్కడిది?

నిఖిల నిగమ-ఉదిత సకామకర్మ వ్యవహారో లోకః। నైషో అంధకార అయమాత్మా।	ఈ లోకములన్నీ కూడా (1) వేదములలో చెప్పబడిన (మరియు) (2) లౌకికమైన ఆయా అనేక సకామ కర్మ వ్యవహారములచే నిర్మితమై ఉన్నట్టివి. అనగా, ఈ జీవుడు స్వపురుషమాత్రుడా? ఈ జీవాత్మ (లేక) జీవుడు అంధకార స్వరూపుడు కానే కాదు. (నిర్విషయుడు, లేనివాడు, శూన్యము కాదు). (ఆత్మ తేజో రూపుడే)।
విద్యా హి కాండ, అంతరాదిత్యో, జ్యోతిర్మండలం గ్రాహ్యం। న అపరమ్। <u>"అసావాదిత్యో బ్రహ్మేతి"</u> అజపయా ఉపహితగ్ం "హగ్ంసః - సోఽహమ్"।	ఈ జీవుడు ఆత్మయొక్క **'ఎరుక'** అనే వెలుగుచేత జడ జగత్తులో ప్రకాశించుచున్న విద్యా స్వరూపుడుగాను, **హృదయాంతరంగంలో** వెలుగొందుచున్న **ఆదిత్య స్వరూపుడుగాను.** జ్యోతిర్మండలాకారమగు ఆత్మ స్వరూపుడుగాను నిర్వచింపబడుచున్నాడు. **ఈ జీవుడు పరమాత్మకు అన్యుడు కాడు. భిన్నము కాదు.** ప్రకాశించుచున్న ఆదిత్యుడే బ్రహ్మము. (బ్రహ్మము నిత్యప్రకాశుడగు ఆదిత్యునివంటిది). [స్వయం ప్రకాశము. సర్వమును తానై వెలిగించునది] అజపానుసంధానంగా (శబ్దములనుదాటి భావనయొక్క అనుసంధాన పూర్వకంగా) - **హంస** - **సోఽహమ్** (కేవల - సందర్భముల మధ్య)గా వెలుగొందువాడు.
ప్రాణ అపానాభ్యాం ప్రతిలోమ - అనులోమాభ్యాగ్ం సమ - ఉపలబ్ధ్యైవగ్ం, సా చిరం లబ్ధ్వా త్రివృత్ - ఆత్మని, బ్రహ్మణి అభిధ్యాయమానే సచ్చిదానందః పరమాత్మా ఆవిర్భవతి॥	అట్టి బ్రహ్మమును ప్రాణ - అపానధారణ పూర్వకంగాను, ప్రతిలోమ (అవరోహణ క్రమము-దిగటము), అనులోమ (ఆరోహణ క్రమము-ఎక్కడము) గుర్తులతోను, కేవలముగాను **"హంసః। సోఽహమ్"** అని దీర్ఘకాలము జపించాలి. ఉపాసించాలి. క్రమంగా (దీర్ఘకాల ఉపాసనచే) సమ్యక్ జ్ఞానము **(సర్వత్రా సమదృష్టి - అనే జ్ఞానము)**చే బ్రహ్మమును ధ్యానించటంచేత సత్ (ఉనికి), చిత్ (ఎరుక), ఆనంద (భావన) స్వరూపుడగు పరమాత్మ అంతరహృదయంగా ఆవిర్భవించ గలడు. (అనగా) పరతత్త్వము స్వానుభవము కాగలదు.
3. సహస్రభానుమత్ చు(సు)రితా, (స్ఫురితా), పూరితత్వాత్ అలిప్యా, పారావార పూర ఇవ।	అట్టి అఖండ పరతత్త్వానుభవం ఎటువంటిదంటే...., - ఆత్మ వేలాది సూర్యుల యొక్క కాంతితో ప్రకాశించు సురి (చురకత్తి) వంటిది. (కత్తివలె 'అన్యము' అనేదంతా ఖండించివేయునది). పూర్ణమగు సముద్రమువలె ఆత్మ నిర్మలము, పరిపూర్ణము అయి ఉన్నట్టిది. జగత్తులతో పూర్ణమై (దలీయాత్) - **వెల్లివిరియుచున్నట్టిది.**
నైషా సమాధిః।	'సమాధి' అనేది సమస్త ఆలోచనలు విరమించు స్థితి. కాని **ఆత్మానందమో? ఆలోచనలన్నిటికీ ఆవల, ఆలోచనలతో సహా సమగ్రమై సమస్తమును తనయందు కలుపుకొని ఉన్నట్టిది.** కనుక అది **'సమాధి'** స్థితి అని కూడా అనలేము.
నైషా యోగసిద్ధిః।	అట్టి ఆత్మస్థితి ప్రతి జీవునిపట్ల సర్వదా సిద్ధించియే ఉన్నట్టిది. అందుచేత "అది యోగాభ్యాసము తరువాత సిద్ధించునది" - అనవీలు కాదు.
నైషా మనోలయః। (కింతు) బ్రహ్మైక్యం తత్।	మనస్సు ఉండటానికి, లేకపోవటానికి ఆత్మస్వరూపమునకు సంబంధము లేదు. కనుక, అది మనో "లయస్థితి" అని కూడా చెప్ప వీలుకాదు. మరి ఆత్మానుభవము (లేక) బ్రహ్మీస్థానము గురించి ఏమని చెప్పుకోవాలి? అది ఈ **జీవాత్మయొక్క తత్ స్వరూపమగు (ఆవలిరూపమగు) "బ్రహ్మము"తో మమైక్య స్థితి. బ్రహ్మమునకు అనన్యస్థితి.**

ఆదిత్యవర్ణం, తమసస్తు పారే **సర్వాణి రూపాణి విచిత్య ధీరః,** **నామాని కృత్వా అభివదన్ యదాస్తే**	ధీరులగు వారు- [ఉత్తమ, సునిశిత, విస్తార, నిర్మల, విచక్షణాసహిత 'ధీ' (బుద్ధి) కలవారు] - సమస్తనామ రూపాత్మకమైనదంతా విచారించి, మాయామయములుగా నిర్ణయించి, అటుపై ఏ 'బ్రహ్మము' గురించి ఎలుగెత్తి చెప్పుచున్నారో, - అట్టి బ్రహ్మము - **ఆదిత్యునివలె స్వయంప్రకాశకము. తమస్సుకు ఆవలది.**
ధాతా పురస్త ఆద్యమ్ ఉదాజహార, **శక్రః ప్రవిద్వాన్ ప్ర-దిశశ్చతస్రః।**	అట్టి 'బ్రహ్మము' గురించి ధాత (బ్రహ్మదేవుడు) ముందుగా వర్ణించారు. ప్రవచించారు. అది తెలుసుకొని ఇంద్రుడు ఆత్మానంద పరవశంతో నలుదిక్కుల గానం చేస్తున్నారు.
తమేవం విద్వాన్ "అమృత ఇహ" భవతి। **న - అన్యః పన్థా అయనాయ విద్యతే।**	నాలుగు దిక్కులందు, నాలుగు అవాంతర దిక్కులందు ఏ ఆత్మను దర్శించి త్రిలోకాధిపతి అగు ఇంద్రుడు గానము చేస్తున్నారో, - అట్టి 'అఖండాత్మ' లేక 'బ్రహ్మము'ను విద్వాంసుడైనవాడు **ఇప్పుడే తెలుసుకొని, ఇక్కడే సర్వత్రా దర్శించుచున్నాడు**. మృత్యువును దాటి **అమృతుడగుచున్నాడు.** అట్టి ఆత్మయొక్క దర్శనము, మమేకముచే '**అమృతత్వము**'ను (మృత్యు పరిధులను అధిగమించటమును) **ఇప్పుడే ఇక్కడే సిద్ధించుకోవాలి**. వేరే ఎప్పుడో, ఎక్కడో కాదు. ఎప్పటికో తెలిసేది కాదు.
యజ్ఞేన యజ్ఞ మ యజంత దేవాః। **తాని ధర్మాని ప్రథమాన్యాసన్। (ప్రథమాని ఆసన్)।**	పైవిధంగా దేవతలు 'జ్ఞాన యజ్ఞము' చేత యజ్ఞ స్వరూపుడగు పరమాత్మకు సర్వతత్త్వ స్వరూపుడుగా యజనము (యోగోపాసన) సమర్పిస్తున్నారు. అట్టి ఆత్మ ధర్మములను **(నిత్యత్వము, సత్యత్వము, అతీతతత్వము, కేవలసాక్షిత్వము మొదలైన ఆత్మయొక్క ముఖ్య ధర్మములను)** న్యాసము (ఉపాసన), అనుష్ఠానము, ధారణ చేస్తున్నారు.
తే హ నాకం మహిమానః సచంతే, **యత్ర పూర్వే సాధ్యాః సంతి దేవాః॥**	అట్టి ఆత్మయొక్క విశిష్ట ధర్మములను ఉపాసించువారు మహాత్ములగు జీవన్ముక్తుల స్థానము సిద్ధించుకొని, **ఆత్మయే తామై, ఆయా నిత్యత్వాది విశేష ఆత్మగుణములతో ప్రకాశించుచున్నారు.**
4. సోఽహమ్ అర్కః, పరంజ్యోతిః। **అర్కజ్యోతిః। అహగ్ం శివః।**	సూర్యునిలోని పరంజ్యోతి స్వరూపముగా ఏ ఆత్మయొక్క మహిమ వెలుగొందుచున్నదో - అట్టి ఆత్మజ్యోతి, పరంజ్యోతి, అర్కజ్యోతి, శివానంద స్వరూపము - "నేనే" అయి ఉన్నాను.
ఆత్మజ్యోతిః అహగ్ం శుక్రః। **సర్వజ్యోతిః అసావహమ్।**	నేనే నిర్మలమగు ఆత్మగా సమస్త జీవులయందు ప్రకాసిస్తున్న జ్యోతి స్వరూపుడను. రస స్వరూపుడను. అఖండాత్ముడను.
ఏతత్ అథర్వశిరో అధీతే, ...	అథర్వవేదమునకు శిరస్సు వంటి ఈ మహావాక్యోపనిషత్‌యొక్క **"అధ్యయన ఫలశృతి" చెప్పుకుంటున్నాము.**
ప్రాతరధీయానో రాత్రికృతం పాపం నాశయతి। **సాయం అధీయానో దివసకృతం పాపం నాశయతి।**	ఉదయము పఠణము, అధ్యయనము చేసిన వానిపట్ల (తద్విధమైన ఆచరణ ఆశ్రయించినవానిపట్ల) రాత్రి చేసియున్న పాపదోషములు నశించగలవు. సాయం సమయంలో ఈ ఉపనిషత్ విశేషాలను అధ్యయనం చేస్తే, పగలు చేసిన కర్మల దోషములు తొలగ గలవు.

తత్ సాయం ప్రాతః ప్రయుంజానః **పాపో అపాపో భవతి।**	ఉదయము, సాయంత్రము కూడా అధ్యయనము చేస్తూ ఉండగా అట్టివాడు 'పాపి' అయినప్పటికీ 'అపాపి' (పవిత్రుడు) కాగలడు. పరమ పవిత్రుడౌతాడు. సర్వత్రా ఆత్మదృష్టిని పొందగలడు.
మాధ్యందినమ్ ఆదిత్యాభిముఖో అధీయానః **పంచమహా పాతక-ఉపపాతకాత్ ప్రముచ్యతే॥**	మధ్యాహ్నమువేళ సూర్యునికి అభిముఖంగా నిలచి, ఈ మహావాక్యోపనిషత్ విశేషాలను పఠణము, మననము చేయువాడు తనయొక్క జన్మజన్మల మహాపాతక, ఉపపాతకములనుండి ముక్తుడు (విముచ్యుడు) కాగలడు.
సర్వ వేదపారాయణ పుణ్యం లభతే। **శ్రీ మహావిష్ణు సాయుజ్యమ్ అవాప్నోతి॥** **మహావాక్యోపనిషత్ - సమాప్తా।** **ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥**	అట్టి వానికి నాలుగు వేదముల పారాయణము చేసిన పుణ్యము లభించగలదు. ఆతడు విష్ణుసాయుజ్యము పొందుచున్నాడు. ***ఇతి మహావాక్యోపనిషత్*** ***ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥***